# పాపం! మగాడు!

## శారద అశోకవర్ధన

అందరి కళ్ళూ ఆ పిల్లమీదే! రాసుకుపోయే వారొకరూ, తోసుకుపోయే వారొకరూ! కాలు తొక్కేస్తూ, చెయ్యి నొక్కేస్తు, 'అయ్యో అయ్యో' అంటే పళ్ళికిలించే పైలా పచ్చీసు మగాళ్ళు ఆమెని తినేసేలా చూస్తున్నారు. ఇవేమీ పట్టించుకోకుండానే, 'అమ్మా...ఒక రూపాయి దానం చెయ్యండమ్మా... అన్నంతిని మూడు రోజులయింది' అంటూ ఆబిడ్ రోడ్‌లో ఒచ్చేపోయే జనాన్ని అడుగుతూన్న ఆ అమ్మాయి మీద నా చూపులు నిలిచిపోయాయి.

చిరిగిపోయిన చీర చిరుగుల్లోంచి పొంగుకొస్తూన్న అంగ సౌష్టవం రెండు పదులు దాటని ఆమె వయస్సుని చెప్పక చెబుతోంది. తైల సంస్కారం లేకపోయినా బొద్దుగా ఎదిగిన జుట్టూ, స్నానంలేక ధూళితో నిండినా పచ్చని శరీరచ్ఛాయా, చలాకీగా తిరుగుతూ అడుక్కుంటూన్న ఆమెను చూస్తుంటే, కాస్త సంరక్షణ వుంటే ఆమె మంచి అందగత్తెననీ, చలాకీ పిల్లేననీ అనిపించింది! "ఏమిటలా తిరిగి తిరిగి చూస్తున్నావ్ దాన్ని?" అన్నారాయన నన్ను చూసి, "ఆ పిల్ల అంత అందమైన పిల్లా అలా అడుక్కు తింటుంటే, బాధగా లేదూ? పైగా ఎంతో చలాకీగా వుంది కదూ?" అన్నాను. మా వారు ఏ కామెంటూ చెయ్యకుండా నవ్వేసి ఊరుకున్నారు. ఆయన అలా ఊరుకోవడం నచ్చని నేను "ఎందుకు నవ్వుతారు?" అంటూండగానే ఆ అమ్మాయి మా వారి దగ్గరికొచ్చి "ఒక్క రూపాయి దానం చెయ్యండయ్యా" అంది. ఆయన నాకేసి చూశారు. నా పర్సులోంచి రూపాయి తీసి, ఆ అమ్మాయికిచ్చాను నవ్వుతూ. సంతోషంగా నాకేసి చూసి, రూపాయి అందుకుంది. ఆమె కళ్ళల్లో నిండిన ఆనందం, నా మనస్సుకి ఏదో తృప్తి కలిగించింది. ఒక్క క్షణంలో ఆ పిల్ల కనుమరుగైపోయింది, ఆ జన సమూహంలో! నాటి నుంచి ఆమె రూపం నాలో అలా నిలిచిపోయింది. ఆబిడ్స్ మీదుగా పోయినప్పుడల్లా, నా కళ్ళు ఆమెకోసం వెతుకుతూనే వున్నాయి. నెలలూ, సంవత్సరాలూ దాటడంతో, క్రమేణా ఆమెని మరిచిపోయాను.




దాదాపు మూడు సంవత్సరాలు దాటాయి. ఒక రోజు మధ్యాహ్నం సికింద్రాబాదులోని మోండా కూరల మార్కెట్టుకి కూరలు కొందామని బయలుదేరాను. మార్కెట్టుకి ఒక ఫర్లాంగు దూరంలో, జనం గుంపులు గుంపులుగా నుంచున్నారు. "ఆక్సిడెంటేమో" గుండె దడదడా కొట్టుకుంది. "అమ్మో! బాబో నన్ను కొట్టకండి! నేచెప్పేది వినండి" అంటూ మొత్తుకుంటున్నా వినక చావబాదుతున్నారు జనం, అతణ్ణి! బాగా తన్నండి! బుద్ధొచ్చేలా తన్నండి! రౌడీ వెధవ అంటోంది ఆవిడ, కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ. కొందరు ఆమెనోదారుస్తున్నారు. ఆయన పక్కనుంటే ఆగనిచ్చేవారు కాదుగానీ, నేనొక్కదాన్నే వుండడం వల్ల, సంగతేమిటో తెలుసుకుందామని ఆగాను. చాక్‌లెట్ రంగు మీద, గులాబి రంగు పూలున్న షిఫాన్ చీరా, చాక్‌లెట్ రంగు బ్లౌజూ, కళ్ళకి కాటుక, పెదవులకి ఎర్రటి లిప్‌స్టిక్కూ, చిన్నగా జుట్టు ముడి, హైహీల్సు, హ్యాండ్ బాగ్, ఎంతో అధునాతనంగా నాజూగ్గా వున్న ఆమెని చూడగానే, నా కళ్ళు అలాగే నిలిచిపోయాయి! రెప్పవాల్చకుండా అలాగే చూస్తూ నుంచుండి పోయాను. వెంటనే ఫ్లాష్ బాక్‌లా గుర్తుకొచ్చింది 'ఒక రూపాయి దానం చెయ్యండమ్మా' అన్న రూపం! ఆశ్చర్యంతో, గుండె ఆగిపోతుందేమోనని పించింది! ఎలా సంభవమిది? సినిమా షూటింగు కాదుకదా అని అనుమానం వచ్చి కలయజూశాను. కొట్టకండి బాబూ! చెప్పేది వినండి అని అతను గోల పెడుతున్నా బాదుతూనే వున్నారు జనం. కసి తీరక, అతని చొక్కా చింపేశారు. జుట్టు పీకేశారు. "ఇంక చాల్లెండి కొంపదీసి వీడు చస్తే డేంజరు అన్నాడొకతను, బహుశా కొటికొట్టి అతని చెయ్యే నొప్పెట్టుంటుంది. అందరూ ఒక్కసారిగా కొట్టడం ఆపేశారు. అందరి కళ్ళూ అటు కేసి చూశాయి. ఆమె రివ్వున ఆటోలో కూర్చుని, వెళ్ళి పోయింది. ఆమె మెప్పును పొందుదామనుకున్న పెద్ద మనుషులందరూ, ఆమె చిటికలో మాయ మవడం, చూసి నీరుకారిపోయారు, నిశ్చేష్టులయ్యారు. ఆ దెబ్బలు తిన్న వాడు కళ్ళు తుడుచుకుంటూ ఇలా అన్నాడు. "ఇప్పుడైనా అసలు సంగతి వినండి. ఈమె ఒక పెద్ద కిలాడీ. నేను ఇక్కడ ఒక క్లబ్బులో క్లార్కుగా పనిచేస్తున్నాను. టిప్‌టాపుగా డ్రెస్ చేసుకుని, ఆటోలో వచ్చి మా దుకాణంలో ఏవేవో వస్తువులు, సంతకం చేసి తీసుకుంది. ఏ మెంబరు భార్యోనని మేము ఊరుకున్నాం. నెలాఖరుకి తేలింది, ఆ పేరుతో ఎవరూ లేరనీ, ఆమె చేసింది దొంగ సంతకమనీ. ఈసారి మళ్ళీ వస్తే పట్టుకుందామని, పెద్దలంతా నిశ్చయం చేశారు. మూడు నెల్ల తరువాత ఇవ్వాళ మళ్ళీ వచ్చింది. మావాళ్ళు ఆమెని నిలదీసి అడిగేసరికి, తన తప్పు ఒప్పుకుంది. పోలిస్‌స్టేషన్‌కి ఈమెని అప్పగించమని నన్ను పంపారు. కొంతదూరం వచ్చేసరికి రక్షించండి, హెల్ప్ హెల్ప్ అంటూ ఈమె అరవడం, మీరందరూ మూగి, నన్ను బాదడం జరిగింది. ఈలోగా ఆమె ఆటోలో తుర్రుమంది. అసలు ఆ పెద్ద



మనుషులకి తెలివిలేదు గానీ, ఇలా నన్నిచ్చి ఆ కిలాడీతో పంపడమేమిటి? పోలీసులని అక్కడికి రప్పించివుంటే, ఈ పాటికి ఆటోలో కాదు, పోలీసు వానులో వెళ్ళుండేది. ఇంతకీ నాఖర్మ. దెబ్బలుతినే గీత రాసుంది ఇవాళ నాకు'' అంటూ చిరిగిపోయిన చొక్కావంక బాధగా చూసుకుంటూన్న అతన్ని చూస్తూ అందరూ గుడ్లప్పగించారు. ఆశ్చర్యంతో కథలాగా వింటూన్న నా చెవులతోపాటు తెరుచుకున్న నోరూ మూత బడలేదు. "పాపమండీ" అని నేనన్నప్పుడు ఆయన నా మాటలకి ఆనాడు ఎందుకు నవ్వారో ఇప్పుడర్థమయింది నాకు! ఇంక మార్కెట్టుకి వెళ్ళడానికి మనసొప్పక, పిచ్చిదానిలా, 'అబలా! ఎంతపనిచేశావ్?' అనుకుంటూ ఇంటి మొహం పట్టాను! అంతుపట్టలేదు అబల ఆడదా? దెబ్బలుతిన్న ఆ క్లార్కా? 'పాపం! మగాడు!' అనిపించింది ఆ క్షణంలో! ●